క్లుప్తంగా

ఉద్యోగ కల్పనే లక్ష్యం

రైల్వేకోడూరు అర్బన్ : నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పని చేస్తామని గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ పార్థసారథి గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ప్రముఖ కంపెనీల సహకారంతో యువతీ యువకులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌మేళాకు మంచి స్పందన వచ్చిందన్నారు. పలువురికి అర్హతను బట్టి ఉద్యోగాలు రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో దుష్ఫలితాలు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రాజశేఖర్

సిద్దవటం : మండలంలోని కడప - చెన్నై ప్రధాన రహదారిలోని వాసవీ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ఫలితాలపై గురువారం అవగాహన సదస్సును నిర్వించామని ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ సూపరింటెండెంటు రవికుమార్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల దుష్ఫలితాలు, చట్టాలపై విద్యార్థులకు వివరించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అమీర్‌ఖాన్, ప్రిన్సిపల్ ప్రదీప్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

గాలివీడు : మండలంలోని గాలివీడు గ్రామం జీబీవీ పల్లె, బుర్జుపల్లి, దానంరెడ్డి గారిపల్లిలలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నాగరాజు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసున్నారు.

డిసెంబర్ 7న సుబ్రమణ్యస్వామి హోమం

రామాపురం : మండల పరిధి హసనాపురం గ్రామంలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో డిసెంబర్ 7న హైదరాబాద్ నగరానికి చెందిన ఆర్ష విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ సుబ్రమణ్యం మూలమంత్రంతో సహస్ర ఆవృత్తుల హోమంలో పాల్గొనదలచిన దంపతులు వెయ్యి రూపాయలు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అనాథలకు స్వెటర్ల పంపిణీ


స్వెటర్లను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

రాయచోటి (జగదాంబసెంటర్) : అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డా.గోవిందు రఘునాథ్, మోడెం నాగముని, ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటశివలు అనాథలకు స్వెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం అర్ధరాత్రి రోడ్డు సైడ్ ఉన్న వారికి, ఆలయాల పరిసరాలలో నిద్రిస్తున్న వృద్ధులు, నిరాశ్రయులకు స్వెటర్లను అందజేశామన్నారు.

పూలే జీవితం ఆదర్శం

రాయచోటి టౌన్ : పూలే జీవితం ప్రపంచానికి ఆదర్శం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం జ్యోతిరావు పూలే 134 వర్ధంతి సందర్భంగా ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలేనే అన్నారు. సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం సాగించారన్నారు. అణగారిన, అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆత్మస్థైర్యం కలిగించి వారి సాధికారికత కోసం కృషి చేసిన మహనీయుడన్నారు. విద్యవివక్ష, పేదరికం, ఆర్థిక అసమానత్వాలను నిర్మూలన, కుల, మత రహిత సమాజం కోసం ఎనలేని కృషి చేశారన్నారు.

అమ్మవారికి వెండి కవచం బహూకరణ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకాలమ్మ దేవస్థానంలో అమ్మవారికి ఉప సర్పంచ్ తోటశివసాయి కుటుంబీకులు గురువారం వెండి కవచాన్ని బహూకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి వెండి కవచం అలంకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుడుగు శివయ్య, సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, మారెళ్ల రాజేశ్వరి, ముత్యాల కిషోర్, నూకా మహేష్ రెడ్డి సిద్దు, త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా హక్కుల పరిరక్షణకు పోరుబాట

రాయచోటి అర్బన్ : డిసెంబరు 4న విజయవాడలో జరిగే ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నేత మావులూరి విశ్వనాథ పిలుపునిచ్చారు. గురువారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలసి ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలంటూ రాయచోటిలో కరపత్రాల ప్రచారం చేశారు. మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం హామీలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. హక్కుల పరిరక్షణ కోసం లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో పోరుబాటకు సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లిబరేషన్ నేతలు రమణ, సుజాత, నీలావతి పాల్గొన్నారు.

ఆక్రమణలకు అంతేలేదు!


కన్యకా చెరువు


కన్యకా చెరువులో అక్రమంగా వెలసిన ఇటుక బట్టీ

- కబ్జా కోరల్లో కన్యకా చెరువు
- నానాటికి కుంచించుకుపోతున్నా.. నిద్రావస్థలో అధికార గణం
- చర్యలు చేపట్టాలని కోరుతున్న మండలవాసులు

నందలూరు : భావితరాలకు సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండాలనే సదుద్దేశంతో పాలకులు చెరువులను, పంట కాలువలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత తరుణంలో ఖాళీ జాగా ఉంటే చాలు అది చెరువు అయినా, ఏరు అయినా, ప్రభుత్వ భూములు అయినా కబ్జాలతో కుంచించుకుపోతున్నాయి. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 420 ఎకరాల విస్తీర్ణంలో కన్యకా చెరువు నీటి సౌలభ్యం కోసం ఏర్పాటు చేశారు. కన్యకా చెరువులో యథేచ్ఛగా ఇటుక బట్టీలు, ఇంటి నిర్మాణాలు వెలిశాయి. ఈ కబ్జాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన విద్యుత్, నీరు, ఇతర సౌకర్యాలు కూడా కబ్జాదారులు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఏడాదికొకసారి ఇరిగేషన్, రెవెన్యూశాఖ వారు చెరువుకు హద్దులు గుర్తించడమే తప్పా కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో కబ్జాదారులు చెరువును ఆక్రమిస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

కన్యకా చెరువు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో కబ్జాదారులకు, అధికారులకు సమన్వయం కుదిరినట్లు ప్రజలు చర్చించుకోవడం కొసమెరుపు. దీంతోపాటు ఆర్ఎస్ రోడ్డులోని అన్ని పంట కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. కాలువలను ఆక్రమించి గదులు నిర్మించి అద్దెలకు ఇచ్చి కబ్జాదారులు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. నిత్యం ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ మార్గం గుండా వెళ్తున్నా ఈ ఆక్రమణలపై పట్టించుకున్న పాపానపోలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆర్ఎస్ రోడ్డు నిర్మాణ సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారుల సమక్షంలోనే కాంట్రాక్టర్లు కాలువలపై బ్రిడ్జీలు నిర్మించకుండా కాలువలను పూడ్చి వేస్తూ రోడ్డు నిర్మించారు. ఈ కాలువలు ఆక్రమణకు గురి కావడం వల్ల వర్షాకాలంలో వరదల వల్ల నీలిపల్లి, విద్యానగర్, గణేష్ నగర్, భారతగ్యాస్ వెనుకవైపు ఉన్న వందలాది మంది ఇళ్లు మునకకు గురై ప్రజలు వివిధ రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువు కాలువ ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కబ్జాలను తొలగించాలి



కన్యకా చెరువులో అక్రమంగా చేపటిన ఇంటి నిర్మాణాలను, ఇటుక బట్టీలను తొలగించి ప్రజలకు తాగు, సాగునీటి సౌకర్యాలు కల్పించాలి. వీటిని అడ్డుకోకపోతే చెరువును రేపటి తరానికి ఇక్కడ ఒకప్పుడు చెరువు ఉండేది అని చెప్పుకోవాల్సి వస్తుంది. అధికారులు నిర్లక్ష్యం వీడి కన్యకా చెరువును పరిరక్షించాలి.

- పిట్టల సుబ్బ నరసయ్య, బెస్త సంఘం నాయకులు, నందలూరు

చెరువే ఆధారం



కన్యకా చెరువునే నమ్ముకుని అందులోని చేపలను వేటాడి జీవనం సాగిస్తున్నాం. రోజురోజుకు కబ్జాలతో చెరువు కుచించుకుపోవడంతో మా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. కబ్జాల నుంచి చెరువుని కాపాడి మా బతుకుదెరువుకు భరోసా ఇవ్వాలని కోరుకుంటున్నాం.

- జింక బాబు, బెస్తపల్లి సంఘం నాయకులు, నందలూరు

నీటి కాలువలో సిమెంట్ రోడ్డు!

సర్వే సిబ్బంది అభ్యంతరం చెప్పినా పట్టించుకోని టీడీపీ నాయకులు


రాళ్లచెరువుపల్లి నుంచి వెళ్లే కాలువలో జరుగుతున్న రోడ్డు పనులు

ఓబులవారిపల్లె : మండలంలోని రాళ్లచెరువుపల్లి గ్రామ సమీపంలోని కాలువలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. గురువారం సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. రాళ్లచెరువుపల్లె చెరువు నుంచి ఆర్సీ కొత్తపల్లి గ్రామానికి ఈ కాలువగుండా పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం వర్షాలు లేక కాలువలో నీరు సాగడం లేదు. ఇదే అదునుగా కాలువపై తూము ఏర్పాటు చేయకుండా ఏకంగా సిమెంట్ రోడ్డును నిర్మిస్తున్నారు. కేవలం తమ పంట పొలాల వద్దకు వెళ్లేందుకు చెరువు నుంచి వచ్చే కాలువలో అడ్డంగా వేయడం ఏంటని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో తమ పంటలకు సాగునీరు ఎలా వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా తమ పంట పొలాల వద్దకు సిమెంట్ రోడ్డు వేసుకుంటున్నారని, సర్వే సిబ్బంది పరిశీలించి సంబంధిత సిమెంట్ రోడ్డు కాలువలో వేస్తున్నారని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలువలో వేస్తున్న సిమెంట్ రోడ్డును నిలిపివేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

బీడీ కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలి


మాట్లాడుతున్న బీడీ కార్మికుల సంఘం నేత జి.ఓబులు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని బీడీ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని బీడీ అండ్ సిగార్ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి బీడీ కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీడీ కార్మికుల సంక్షేమ చట్టాన్ని కేంద్రప్రభుత్వం రద్దు చేయడం తగదన్నారు. యాజమాన్యాలు ప్రభుత్వం నిర్దేశించిన వేతనాలను కార్మికులకు చెల్లించకపోతుండడం దారుణమన్నారు. పైగా ఈఎస్ఐ, పీఎఫ్‌లు సైతం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రస్తుత పాలకులు బీడీ ఫ్యాక్టరీల నుంచి 27 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నప్పటికీ ఒక్క రూపాయి కూడా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయడం లేదంటూ మండిపడ్డారు. బీడీ కార్మికులకు గుర్తింపు కార్డులు, వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, డిస్పెన్సరీలలో వైద్యసౌకర్యాల కల్పనతో పాటు పక్కాగృహాలను మంజూరు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్మికులకు ఆరోగ్యబీమాను వర్తింపజేయాలన్నారు. కేరళ రాష్ట్రం తరహాలో వెయ్యి బీడీలు చుడితే కార్మికులకు కూలీ రూ.500 ఇచ్చేలా చూడాలంటూ కోరారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, స్థానిక సీఐటీయూ నేతలు భాగ్యలక్ష్మి, మాధవయ్య, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలి

రామాపురం : ఉపాధ్యాయులకు రెసిడెన్సియల్ శిక్షణ కార్యక్రమాలు రద్దు చేయాలని, ఏ జిల్లా ఆ జిల్లాలోనే నాన్ రెసిడెన్సియల్‌గా శిక్షణ ఇవ్వాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఆ సంఘం నాయకులు రామాపురంలో విలేకరులతో మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాలను రద్దు చేయాలని విన్నవించినా పట్టించుకోని ప్రభుత్వ మొండివైఖరితో ఇప్పటికి ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందారన్నారు. దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. విజయనగరం జిల్లా గణపతి నగరం బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో జరుగుతున్న ట్రైనింగ్‌లో ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావు గుండెపోటుకు గురై మృతి చెందడం దిగ్భ్రాంతిని గురి చేసిందన్నారు. ఉపాధ్యాయుల మృతికి ఎవరు బాధ్యత తీసుకుంటారని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులందరికీ అందుబాటులో మండలం లేదా డివిజన్ కేంద్రాలలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని తెలియజేశారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్ హక్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.మునిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, ఎస్.జక్రియ బాషా, జిల్లా కన్వీనర్ లియాకత్‌అలీ, కో-కన్వీనర్ అస్మత్‌బాషాలు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమం

గాలివీడు : ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆక్రమణకు గురైన ఆర్ అండ్ బీ స్థలాన్ని స్థానిక సీపీఐ నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 2266లో ఉన్న ఆర్ అండ్ బీ స్థలాన్ని ఇష్టానుసారంగా వాటాలు పంచుకుని అక్రమంగా రేకులను ఏర్పాటు చెయ్యడం వారి బరితెగింపునకు నిదర్శనమన్నారు. మరోవైపు ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను సైతం నామరూపాలు లేకుండా నేలమట్టం చేయడం దారుణమన్నారు. ఇంత జరుగుతున్న అధికారులు మీనమేషాలు లెక్కించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

దుకాణాలు వేసుకోవడంలో అధికారుల ప్రమేయం ఉందని ఆరోపించారు. వెంటనే ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో స్థానికులతో కలసి ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణమూర్తి, భాస్కర్ యాదవ్, ఓబులేసు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో దురలవాట్లు దూరం


లక్కిరెడ్డిపల్లి: వైభవంగా అంబలం పూజను జరుపుతున్న గురుస్వాములు


రాజంపేట టౌన్: పడిపూజలో పాల్గొని పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

లక్కిరెడ్డిపల్లి : ఆధ్యాత్మిక చింతనతోపాటు దురలవాట్లకు దూరంగా ఉండడమే అయ్యప్ప దీక్ష అని లక్కిరెడ్డిపల్లి గురుస్వాములు రమణ, వెంకటేష్, గంగరాజు, వేణు, రమణలు పేర్కొన్నారు. అనంతపురం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలాధారుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అయ్యప్ప భజనలు అనంతపురం గ్రామం మార్మోగింది. అయ్యప్ప మాలాధారణ భక్తులకు అన్నదానం (భిక్ష) ఏర్పాటు చేశారు. కాగా నామాలగుట్టపై ఉన్న అయ్యప్ప ఆలయంలో గురువారం మద్దిరేవులకు చెందిన రంగారెడ్డి మాలాధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మాలధారణతో సత్ప్రవర్తన

రాజంపేట టౌన్ : మనిషి సత్ప్రవర్తనతో సన్మార్గం వైపు పయనించేందుకు మాలధారణ దోహదపడుతుందని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. మండలంలోని అచ్చెనపల్లె గ్రామంలో గురువారం రాత్రి అయ్యప్ప భక్తులు నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆకేపాటి మాట్లాడారు. మనిషిలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందినప్పుడే సమాజంలో శాంతికుసుమాలు విరాజిల్లుతాయన్నారు. అంతేకాక ప్రజల్లో ఐక్యతాభావం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల సౌమిత్రి, చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణకు విస్తృత ప్రచారం

రాయచోటి (జగదాంబసెంటర్) : స్థానిక అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో బాలలను బాల్య వివాహాల నుంచి కాపాడేందుకు సమత స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ డైరెక్టర్ బి.ఆదినారాయణరెడ్డి, జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసనాయుడు తెలిపారు. కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణదేవి ప్రారంభించిన జాతీయ బాల్ వివాహ ముక్త్ భారత్ ప్రచారానికి పూర్తి మద్దతు ఇస్తున్నామన్నారు. అన్నమయ్య జిల్లాలో బాల్యవివాహాల నివారణకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు వారు తెలిపారు. జిల్లాలోని 51 పంచాయతీలలో దాదాపుగా 18,500 మంది ప్రజలు, ఉపాధ్యాయులతో బాల్యవివాహాలు నిర్వహించే మత పెద్దలతో ఆహ్వాన పత్రికల ప్రింటర్లతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొవ్వొత్తులు వెలిగించి నినాదాలు చేస్తూ ర్యాలీలు చేపడతామని తెలియజేశారు. ప్రణాళికాబద్ధంగా ప్రారంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు దేశవ్యాప్త ఉద్యమంగా మారి లోతుగా పాతుకుపోయిన ఈ బాల్య వివాహ ఆచారాన్ని శాశ్వతంగా నిర్మూలనకు యావత్ దేశం ఏకమైందని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ వ్యవస్థాపకుడు భువన్‌రిబు తెలియజేశారు.

చీడపీడల నివారణకు సూచనలు పాటించాలి


సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న ఏడీఏ శ్రీలత

రాయచోటి టౌన్: రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, నువ్వుల పంటలకు చీడపీడలు ఆశిస్తున్నాయని వాటిని రక్షించుకోవడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కలికిరి కేవీకే శాస్త్రవేత్త సోమశేఖర్, మాధవి (ఏఆర్ఎస్ ఊటుకూరు) శాస్త్రవేత్తలు అన్నారు. గురువారం రాయచోటి మాసాపేటలోని మార్కెట్ యార్డులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు రబీ సీజన్‌లో సాగులో ఉన్న పంటలను ఎలా కాపాడుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు.

చీడ, పీడలు నివారణకు అధికారులను సంప్రదించి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మామిడి తోటలలో పూత దశకు వచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి చెప్పారు.

పూలే ఆశయాల కోసం పోరాడుదాం

- ఘనంగా మహాత్మ పూలే వర్ధంతి
- నివాళి అర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు
- రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందంటూ ధ్వజం


రైల్వేకోడూరు అర్బన్: పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


రాయచోటి అర్బన్: పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మున్సిపల్ ఛైర్మన్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు

రైల్వేకోడూరు అర్బన్ : మహాత్మ జ్యోతిరావ్ పూలే ఆశయాల అమలు కోసం పోరాడాల్సి వస్తుందని గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో జ్యోతిరావు పూలే ఆదర్శంగా తీసుకొని పాలన చేయాల్సింది పోయి ప్రస్తుతం బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు రక్షణ లేకుండా అణచివేస్తున్నారని తెలిపారు. గత పాలనలో బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు అన్ని చోట్ల ప్రాధాన్యం ఇచ్చి వారి అభ్యున్నతికి పాటుపడిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందరూ గుర్తు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, రాజేశ్వరి, నందబాల, సుబ్బరామరాజు, శివయ్య, మహేష్, మల్లికార్జున, డివి రమణలు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా పేరుగాంచిన మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిస్తామని మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ బిసి నేతలు విజయభాస్కర్, రమేష్‌లు అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకుని వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జ్యోతిరావు పూలే ఆశయాలను అణగదొక్కేలా పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో అణగారిన వర్గాల సంక్షేమాన్ని గాలికి వదలేయడమే కాకుండా రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలపై కఠిన చర్యలు తీసుకోవడం లేదన్నారు.

సామాజిక విప్లవమూర్తి పూలే


రాజంపేట టౌన్: పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఈశ్వరయ్య

రాజంపేట టౌన్ : మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక విప్లవమూర్తి అని రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లబోతుల ఈశ్వరయ్య తెలిపారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో గురువారం ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి ఈశ్వరయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జ్యోతిరావుపూలే సామాజిక అసమానతలను ఛేదించి, అణగారిన వర్గాలకు ఆశాజ్యోతి అయ్యారన్నారు. మహిళా అభ్యుదయవాది, నిరంతరం మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన పూలే నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డే రమణ, గోవిందు బాలకృష్ణ, చాపల బాలాజీ, దొంకా సూరి, దాసరి పెంచలయ్య, పాపినేని విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే


సుండుపల్లె: పూలే విగ్రహానికి ఘన నివాళులర్పించిన ప్రజా సంఘాల నేతలు

సుండుపల్లె: మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని పలు పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని లక్కిరెడ్డిపల్లిలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

లక్కిరెడ్డిపల్లి : బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం మహాత్మ జ్యోతిరావు పూలే అని ముదిరాజ్ ఐక్యవేదిక నాయకులు యలంకూరి విజయభాస్కర్, సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి పేర్కొన్నారు. పూలే వర్ధంతిని పురస్కరించుకొని బీసీ వేదిక ఆధ్వర్యంలో గురువారం లక్కిరెడ్డిపల్లిలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పురుషోత్తం, ఈశ్వరయ్య, బసయ్య, వెంకటస్వామి, రాము పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా


ఎమ్మెల్యే ఆకేపాటితో మాట్లాడుతున్న నాయకులు

వీరబల్లి : మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని ఓదివీడు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు మొహజాన్ కుమార్తె వివాహానికి ఆకేపాటి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆకేపాటి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని అధైర్యపడొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు, మాజీ సర్పంచ్ మహబూబ్ బాషా, మైనార్టీ యువ నాయకులు ఇమామ్ బాషా, షాహీర్ బాషా, శివరాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణాన్ని జరుపుతున్న వేదపండితులు

సిద్దవటం : మాధవరం-1 పంచాయతీలోని ఎస్‌కేఆర్ నగర్‌లో వెలసిన శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో గురువారం నిత్యపూజేశ్వర శివ పార్వతుల ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల ఉత్సవ మూర్తులను అలంకరించి వేదికపైకి చేర్చి కల్యాణ క్రతువును జరిపించారు. కల్యాణం అనంతరం జనసేన నాయకుడు అతికారి క్రిష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రెడ్డయ్య మృతి కార్మికులకు తీరనిలోటు

రాజంపేట టౌన్: కమ్యూనిస్టు నాయకుడు టి.రెడ్డయ్య మృతి కార్మికులకు తీరని లోటని సీపీఐ సీనియర్ నాయకులు, అఖిల భారత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగసుబ్బారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో కమ్యూనిస్టు పార్టీ మాజీ నాయకుడు ముజఫర్ అహమ్మద్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన రెడ్డయ్య సంస్మరణ సభలో నాగసుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. రెడ్డయ్య విద్యార్థులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు చేశారని కొనియాడారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో ముఖ్య భూమిక పోషించారన్నారు. ఆర్‌సీ రెడ్డి యూత్ గైడెన్స్ సెంటర్ ద్వారా ఆయన పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇప్పించి అనేక మంది భవిష్యత్తుకు ఉజ్వల బాటవేశారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఈశ్వరయ్య, చిట్వేలి రవికుమార్, పి.మహేష్, జెనుగు కృష్ణారావుయాదవ్, పలుకూరి వెంకటరమణ, సధాకర్‌రెడ్డి, టి.లక్ష్మీనారాయణ, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిషోర్ బాలికల సంరక్షణ అందరి బాధ్యత


బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సిద్దవటం: కిషోర్ బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం లోని ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో గురువారం కిషోర్ వికాసంపై ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో ఒక్కరోజు గ్రామ స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 11-18 సంవత్సరాల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంభనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. బాలికల్లో బాల్యం నుంచి యుక్త వయస్సు వరకు దశలవారీగా వచ్చే మార్పులు సమస్యలపై అన్నీ శాఖల వారికి అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారం

గాలివీడు : బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికల భవిష్యత్తు అంధకారంలో పడిపోతుందని లక్కిరెడ్డిపల్లి సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. ఆమె గురువారం మండల కేంద్రంలోని పక్కీర్‌రెడ్డిగారిపల్లి అంగన్వాడి కేంద్రంలో బాల వివాహాలపై టీచర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని అరికట్టేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ఒంటిమిట్ట : పూత దశలో చేపట్టవలసిన సస్యరక్షణపై మండల పరిధిలోని రాచగుడిపల్లి రైతు సేవా కేంద్రంలో గురువారం మండల ఉద్యాన శాఖాధికారి రెడ్డయ్య రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్చింగ్, ఫార్మ్ పాండ్, డ్రిప్ అండ్ స్ప్రింక్లర్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారు రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. అలాగే రాయగుడిపల్లిలో ఉన్న మామిడి తోటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.